నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 23 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## నేరప్రవృత్తి మార్చుకోవాలి




ఖైదీతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 22 : ఖైదీలు నేరప్రవృత్తి మార్చుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు జీవితం నాశనం అవుతుందని, ప్రతి ఒక్కరూ శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని, జైలులో తమ ప్రవర్తను మార్చుకొని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

## వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేకం



కొమ్ముగూడెంలో బెల్లం పానకం, నీళ్ల బిందెలతో ఆలయాలకు వెళ్తున్న మహిళలు

తాండూర్, జూన్ 22 : వర్షాలు కురవాలని వేడుకుంటూ శనివారం కొమ్ముగూడెం గ్రామంలో పోచమ్మ, గ్రామ దేవతలకు భక్తులు, స్థానికులు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని మహిళలు నీళ్ల బిందెలు ఎత్తుకొని ఆలయాలకు చేరుకుని విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. పసుపు-కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు.

# సింగరేణి జోలికొస్తే ఊరుకోం

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికలోకం హెచ్చరిక**

- ఉద్యమాలు చేసైనా గనులను కాపాడుకుంటం
- అవసరమైతే సమ్మెకు దిగుతామని స్పష్టం
- బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని డిమాండ్
- ప్రైవేటీకరణను వ్యతిరేకించిన కేసీఆర్ సర్కారు



మంచిర్యాల, జూన్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతుండగా కార్మికలోకం కన్నెర్ర చేస్తున్నది. సింగరేణి జోలికి వస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే ఉద్యమాలు చేసి సంస్థను కాపాడుకుంటామని స్పష్టం చేస్తున్నది. 130 ఏళ్లకు పైగా చరిత్ర, ప్రపంచంలో అత్యుత్తమ టెక్నాలజీ, 41 వేల స్కిల్డ్ మ్యాన్‌పవర్ ఉన్న సంస్థను కాదని సింగరేణిబొగ్గు గనులను ప్రైవేట్‌కు కేటాయిస్తే తామేం చేయాలంటూ మండిపడుతున్నది. బొగ్గు గనులు ప్రైవేటుకు ఇచ్చి, ఉన్న గనులు మూతపడ్డాక మా ఉద్యోగాలకు భరోసా ఏదని ప్రశ్నిస్తున్నది. ఉత్పత్తి, ఆదాయంలో అన్ని సంస్థలకంటే ముందున్న సింగరేణిపై అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలని, ఏదేమైనా వేలాన్ని అడ్డుకుంటామని, సింగరేణిని రక్షించుకుంటామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

### అవసరమైతే సమ్మెకు దిగుతాం

బొగ్గు గనుల వేలంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ శుక్రవారం సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన కార్మికులు, ఆయా సంఘాల నాయకులు అవసరమైతే సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. సంస్థలో 20 వేల మంది 35 నుంచి 45 ఏళ్లున్నవారు ఉన్నారని, కంపెనీ వేలంలో బావులు ప్రైవేట్ వాడికి వెళ్తే.. ఉన్న బావులు అయిపోయాక ఈ 20 వేల మంది భవిష్యత్తు ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతున్నది. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా దశలవారీగా నిరసనలు వ్యక్తం చేస్తామని, అప్పటికీ మార్పు రాకపోతే సమ్మె తప్పదని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వానిది 51 శాతం వాటా ఉంటే, కేంద్రానిది 49 శాతం వాటా ఉండేదని, కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు చేసి చివరకు 49 శాతం వాటాను కుదువపెట్టిందని, మరోసారి ప్రైవేటీకరణకు సహకరించాలని చూస్తున్నదని కార్మికులు మండిపడుతున్నారు.

### కేసీఆర్ సర్కారులో పోరాటం

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతుండగా, ఆ జాబితాలో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా పరిధిలోని శ్రావణపల్లి మైన్ సైతం ఉంది. సింగరేణిని ప్రైవేటీకరించమని మోదీ రామగుండం ఎరువుల ప్యాక్టరీకి వచ్చి చెప్పి వెళ్లిన మరునాడే కేంద్ర ప్రభుత్వం రెండు బొగ్గు గనులకు వేలం వేసింది. కానీ, అప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా ప్రతిఘటించింది. వేలం వేయొద్దంటూ కార్మికుల పక్షాన పోరాటాలు చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు మోదీ ప్రభుత్వానికి వంత పాడుతున్నది. వేలంలో పాల్గొనాలంటూ సింగరేణి సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారమున్నది. చేయాల్సిందంతా చేసి కేసీఆర్ సర్కారుపై నిందలు మోపాలని చూస్తున్నది. కేసీఆర్ ఉన్నప్పుడే బొగ్గు గనులు వేలం వేశారని చెబుతూ.. మొత్తం సింగరేణిని ఆగం చేసేందుకు కుట్రలు చేస్తున్నది.

### కేసీఆర్ సింగరేణిని కాపాడిండు



శ్రీరాంపూర్, జూన్ 22 : కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికులు 41 రోజులు సకల జనుల సమ్మె చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. కార్మికులపై ప్రత్యేక అభిమానంతో అనేక హక్కులు కల్పించారు. 10 ఏళ్ల క్రితమే బీజేపీ ప్రభుత్వం గనులు ప్రైవేట్ పరం చేయాలని కుట్ర పన్నితే కేసీఆర్ కాపలా ఉండి కాపాడారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రానికి సహకరిస్తుంది. వెంటనే సింగరేణికి గనులు కేటాయించాలి. లేదంటే ఉద్యమాలు తప్పవు.

*-సాదుల భాస్కర్, ఎస్పార్పీ-3 ఫ్యాన్ ఆపరేటర్, శ్రీరాంపూర్*

### బీజేపీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మేస్తుంది



శ్రీరాంపూర్, జూన్ 22 : బీజేపీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మేస్తున్నది. ఇందులో భాగంగానే సింగరేణిని కూడా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్నది. గతంలో ఆంధ్రోళ్లు మనలను దోచుకున్నరు. ఇప్పుడు మన తెలంగాణ వాడే బొగ్గు,గనుల శాఖ మంత్రిగా ఉండి మనల్ని, సింగరేణిని దోచి మోదీకి పెట్టాలని కుట్రలు చేస్తున్నడు. కార్మిక వర్గం మోస పోవద్దు. కొత్త చట్టంలోనే కేంద్ర ప్రభుత్వం గుజరాత్ రాష్ట్రానికి బొగ్గు గనులు నేరుగా కేటాయించింది. సింగరేణిలో ఎందుకు ఇవ్వరో చెప్పాలి.

*-తొంగల రమేశ్, ఎస్డీఎల ఆపరేటర్, శ్రీరాంపూర్*

### సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర



శ్రీరాంపూర్, జూన్ 22 : కేంద్రం గనులను దౌర్జన్యంగా లాక్కొని సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుంది. గనులను ప్రైవేట్ వాడికి అప్పగించి.. ఆపై నష్టాలు చూపి ఉద్యోగాల్లేకుండా మోసం చేసే కుట్ర చేస్తున్నది. అటు ఆంధ్రాలో తెలంగాణకు వ్యతిరేకమైన పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇటు తెలంగాణలో ఆయన శిష్యుడు వచ్చాడు. ఇద్దరు కలిసి తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేకుండా కుట్రలు చేస్తున్నరు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుంటే ఒక్క బొగ్గుపెల్ల కూడా ప్రైవేట్ సంస్థలు తీయలేవు. కార్మికులు పోరాడి గనులు సాధించుకుంటరు.

*-తీగల వెంకట్‌రెడ్డి, ట్రామర్, శ్రీరాంపూర్*

### బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంది



మందమర్రి, జూన్ 22 : గతంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాకులకు టెండరు నిర్వహించేందుకు యత్నించగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంది. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కార్మికుల మద్దతు కూడగట్టి మందమర్రి మార్కెట్‌లో 12 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకించడంతో పాటు ప్రజాప్రతినిధులు ఆందోళన బాట పట్టడంతో కేంద్రం టెండరు ప్రక్రియను వెనక్కి తీసుకుంది. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వం కుట్రలను వ్యతిరేకించాలి. బొగ్గు గనుల ప్రైవేటీకరణపై తమ వైఖరిని కార్మికులకు స్పష్టం చేయాలి. లేని పక్షంలో కార్మికులు ఆందోళన బాట పట్టడంతో పాటు ప్రజాప్రతినిధులను అడ్డుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

*- బెల్లం అశోక్, సింగరేణి కార్మికుడు, మందమర్రి*

### ప్రైవేట్‌పరమైతే ఇబ్బందులే..



రెబ్బెన, జూన్ 22 : సింగరేణి సంస్థలోని గనులు ప్రైవేట్‌పరమైతే ఇబ్బందులు తప్పవు. ఉద్యోగావకాశాలు తగ్గుతాయి. కేంద్రం గతంలో కూడా గనుల వేలం కోసం యత్నించగా అప్పటి కేసీఆర్ సర్కారు అడ్డుకున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే అప్పటి సర్కారు సింగరేణిలో 49 శాతం వాటాను కేంద్రానికి అప్పగించింది. సింగరేణి సంస్థలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ విషయాన్ని గుర్తించాలి.

*- వంగ మహేందర్‌రెడ్డి, సీనియర్ మైనింగ్ సర్దార్, బెల్లంపల్లి ఏరియా*

### బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి



మందమర్రి, జూన్ 22 : సింగరేణిలో నూతనంగా గుర్తించిన బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి. కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నించడం సరికాదు. సింగరేణి ప్రైవేటుపరం కావడం వల్ల ఈ ప్రాంతంలో నిరుద్యోగం పెరిగిపోతుంది. సింగరేణి సంస్థ మనుగడకూ తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేదంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మొదలవుతాయి. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమే.

*- అందె శ్రీకాంత్, సింగరేణి కార్మికుడు, మందమర్రి.*

### కేసీఆర్ సర్కారులో సాహసించలేదు



రెబ్బెన, జూన్ 22 : సింగరేణిలోని గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే భవిషత్తులో ఉపాధి కోల్పోయే అవకాశముంది. వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి బ్లాక్‌లు కేటాయించాలి. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనడం వలన 4 శాతం గరిష్ఠంగా తట్టుకొని 20 శాతం రాయల్టీ చెల్లించి గనులు దక్కించుకోవడం వల్ల బ్లాక్‌లో నష్టం జరిగే అవకాశముం టుంది. గనులు కేటాయించే పద్ధతి ఇలాగే కొనసాగితే 20 ఏళ్ల తర్వాత సింగరేణి మూతపడక తప్పదు. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ సీఎం అయిన తర్వాత గనుల వేలం పాటకు ఎవ్వరూ సాహసించలేదు.

*- మల్రాజు శ్రీనివాసరావు, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు*

### కాంగ్రెస్, బీజేపీలను ఆదరించినందుకా..



శ్రీరాంపూర్, జూన్ 22 : తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలను ఆదరించినందుకు ఇదా సింగరేణి కార్మికులకు ఇచ్చే బహుమానం. కార్మికుల మరోసారి మోసపోయారు. సింగరేణి సంస్థలో గనులు ప్రైవేటీకరణకాకుండా కేసీఆర్ అడ్డుపడ్డరు. ఆయన హయాంలో గనుల ప్రైవేటీకరణ, వేలాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కానీ ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకే వేదిక పంచుకొని కమీషన్ల కక్కుర్తితో గనులను వేలం వేయాలని చూస్తున్నది. ఇది కార్మిక వర్గం సహించదు. తగిన బుద్ధి చెప్పి తీరుతారు.

*-గోదారి భాగ్యరాజ్, కోల్‌కట్టర్, శ్రీరాంపూర్*



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, బాధితురాలు

## అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి

- కోర్టు ఆదేశాలను అమలు చేయాలి
- బాధితులు, బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రి, జూన్ 22 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని చొప్పరిపల్లి గ్రామంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించి కాంగ్రెస్ నాయకుడు జుమ్మిడి విశ్వనాథ్ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని బాధితురాలితో పాటు బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బీఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది ఎంవీ గుణ, పీవోడబ్ల్యూ నాయకురాలు మద్దెల భవాని మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చొప్పరిపల్లి గ్రామానికి చెందిన వడాల దుర్గమ్మకు వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్ 146/63లో గల ఎకరం భూమిని, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జుమ్మిడి విశ్వనాథ్ ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టాడని తెలిపారు. దుర్గమ్మ కొంతకాలంగా భీమారంలోని తన కూతురు వద్ద ఉంటోందని, అట్టి భూమికి సంబంధించి దుర్గమ్మకు పట్టా కూడా ఉందన్నారు. గ్రామంలో దుర్గమ్మ లేక పోవడంతో విశ్వనాథ్ అట్టి భూమి తనదేనని చెప్పి అక్రమ నిర్మాణం చేపట్టాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఆ భూమి తనదేనని బుకాయిస్తున్నాడన్నారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని వారసత్వంగా వచ్చిన భూమిని ఇప్పించాలని సంబంధిత మున్సిపల్, రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో హైకోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న రాష్ట్ర హైకోర్టు అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందని వారు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి విశ్వనాథ్ తన అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దుర్గమ్మకు న్యాయం చేయాలని వారు కోరారు. దీని పై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు స్పందిస్తూ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను తొలగించడానికి డీటీఎఫ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీతో చర్చించి వారంలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు బొడ్డు వినోద, శిరీష, రజిత పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి

**కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 22 : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 19 ఏళ్లలోపు వారికి నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఇంటి నుంచి తడి,పొడి చెత్తను సేకరించి డంప్‌యార్డులకు తరలిస్తున్నారన్నారు. జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నందున వాటి ప్రగతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జోడేఘాట్, మార్లవాయి, చింతలమాదర జలపాతం, గుండాల, మిట్టి జలపాతాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముష్కాన్ బాలి శ్యామ్, కార్తీక్, శ్రీనివాసన్, ఐశ్వర్య పాల్గొన్నారు.

## 25న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్, 22 : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఈ నెల 25న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ- విజయవాడ, ఐటీడీఏ-ఉట్నూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొబ్బరి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు. రాయితీలు, సాగు విధానాల గురించి సంబంధిత శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని కొబ్బరి సాగుపై సందేహాలను నివృత్తి చేసుకుని, మెళకువలు తెలుసుకోవాలని సూచించారు.

## గూడెంలో వైభవంగా జ్యేష్ఠ పౌర్ణమి జాతర

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

దండేపల్లి, జూన్22 : మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం జ్యేష్ఠపౌర్ణమి జాతర వైభవంగా సాగింది. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు సమీప గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. గుట్టపైనున్న సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఆలయంలో 169 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. దర్శనం అనంతరం భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, జూన్ 22 : మహిళా శక్తి ద్వారా ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో మైక్రో ఎంటర్ ప్రైజెస్ విభాగంలో 5684 మందికి రూ. 64.73 కోట్లు, స్టిచ్చింగ్ సెంటర్ల విభాగంలో 618 మందికి రూ. 2.35 కోట్లు, పాడి పశువుల విభాగంలో 500 మందికి రూ. 4.50 కోట్లు, బ్యాక్‌యార్డు ఫౌల్ట్రీ విభాగంలో 2 వేల మందికి రూ. 3 కోట్లు, ఫౌల్ట్రీ మదర్ యూనిట్ల విభాగంలో 16 మందికి రూ. 46 లక్షలు, మిల్క్ పార్లర్ల విభాగంలో ఒక్కొక్కరికీ రూ. 1.90 లక్షలు, మీ సేవ విభాగంలో 20 మందికి రూ. 50 లక్షలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ విభాగంలో 21 మందికి రూ. 31 లక్షలు, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల విభాగంలో 200 మందికి రూ. 4 కోట్లు అందించేందుకు కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 16 మండలాల్లో కార్యచరణ ప్రకారం లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.




